
# దూరం

కిల్లాన మోహన్‌బాబు



జనవరి 1, 1979

సూరిగాడు రిక్షా తొక్కుతున్నాడు... గత యిరవై ఏళ్ళగా వాడలా రిక్షా తొక్కుతూనే బ్రతుకీడుస్తున్నాడు.... ఆ రిక్షా చక్రాలకు పోటీగా వాడి 'బుర్ర'లో ఎన్నో ఆశలూ, ఆలోచనలూ తిరుగుతూనే ఉన్నాయి। కాని, అవేవీ యింత వరకూ 'కార్యరూపం' దాల్చ లేదు।

ఇంతకీ ఓ స్వంత రిక్షా కొనుక్కోవాలన్నది వాడి జీవితాశయం, చిన్న కోరిక।

అది ఎన్నాళ్ళయినా నెరవేరడంలేదు।

ప్రతి కొత్త సంవత్సరం నాడు వాడిలోని ఈ కోరిక ఒక్కసారి బుస్సుమని తాచులా లేస్తుంది।

'ఈఏడైనా ఈకోరిక తీరకపోతుందా' అన్న ఆశ ఆ కోరికని చల్లారుస్తుంది।

అందుకే వాడు పగలూ రాత్రీ కష్టపడి రిక్షాలాగి డబ్బులు సంపాదిస్తాడు. కాని, అవి ఎలా కరిగిపోతాయో వాడికీ తెలీదు. కూడబెట్టిన ఆ డబ్బులు ఎలా ఖర్చయిపోతాయో అర్థంకాదు. అసలు తనకున్న యీ చిన్న కోరిక ఎందుకు నెరవేరడం లేదో వాడికర్థం కావడంలేదు। ఇంతలో వాడి గుడిసె వచ్చేసింది. రిక్షా ఆపి యింట్లోకి వెళ్లాడు. రత్తాలు వంట చేస్తోంది.

"ఏంమావాఁ, యియ్యేల ఎంత కిట్టిందేటి?" అడిగింది రత్తాలు కర్రల పొయ్యి మీద అన్నం కలుపుతూ.

"అఁ, ఏదో తొమ్మిది రూపాయలే. అద్దెపోను ఆరు మిగిలింది." నీరసంగా అన్నాడు సూరిగాడు.

"అలా రెక్కలు ముక్కలు సేసికుని సంపాయించిన డబ్బు ఊరోడికి పొయ్యకపోతే, యీ ఏడైనా నువ్వో కొత్త రిచ్చా కొనుక్కోరాదూ?"

"ఇలా పతియేడూ అనుకోవడం–అది అవకపోవడం మామూలైపోయిందే మన బతుకులకి...."

ఏం అనుకుందో, మరి రత్తాలు ఏమీ మాట్లాడలేదు....

* * *

సుబ్బారావు సైకిలుమీద నెమ్మదిగా పోతున్నాడు. ఆ సైకిలు చక్రాలకు పోటీగా అతని మెదడు'లోని ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి. ఏమిటో తన జీవితం? ఎంత కష్టపడుతున్నా సుఖం కరువయిపోయింది. ఆఫీసులో పని ఎంత 'సిన్సియర్'గా చేసినా, ఆఫీసరునుంచి చీవాట్లూ, దూషణ భూషణలూ తప్ప ప్రశంసలూ, ప్రమోషన్లూ కరువయ్యాయి! ఇహ యింటి విషయానికొస్తే, తన భార్యని ఉన్నంతాంట్లో ఎంత సుఖపెట్టాలని చూసినా ఆమెలో ఏదో నిరుత్సాహం, నిస్పృహ తొంగిచూస్తున్నాయి!

తనలాంటి గుమాస్తాగాణ్ణి కట్టుకున్నందుకు ఆమెలో చెప్పలేని నైరాశ్యం.

తన బ్రతుకులో మరి మార్పు రాదా? తన ఆర్థిక స్థితి మెరుగుపడదా?

గత పదేళ్లుగా ఓ 'స్కూటర్' కొనుక్కోవాలని సుబ్బారావు జీవితాశయం, చిన్న కోరిక! ఈ ఎగుడు, దిగుడు రోడ్లమీద సైకిల్ తొక్కడం చాలా కష్టంగా ఉందతనికి. ఇంట్లో ఖర్చులు కూడా తగ్గించుకుని ఓ ఐదేళ్ల బ్యాంకులో దాచిన డబ్బు తన చెల్లెలి పెళ్లిలో ఖర్చయిపోయింది! ఆ తరువాత మరో రెండేళ్ల పోస్టాఫీసులో దాచినది తన 'హెర్నియా ఆపరేషన్'కి సరిపోయింది!

ఆ డబ్బు దాచుకోవడం తన జాతకానికి సరిపోదని ఆ 'సేవింగ్స్'కీ 'గుడ్‌బై' చెప్పేశాడు సుబ్బారావ్.

ఇంతలో అతనిల్లు వచ్చేసింది.

సైకిల్ వరండాలో పెట్టి యింట్లోకి వెళ్లాడు. భార్య కమల 'స్టవ్'మీద వంట చేస్తోంది. పిల్లలు చదువుకుంటున్నారు.

"ఇవ్వాళ పెందరాళే వచ్చారేం?"


తను ఎప్పుడూ లేట్‌గా వస్తాననివిసురు!

"ఈవాళ జనవరి ఫస్టు కదా! కొత్త సంవత్సరంలోనైనా తొందరగా యింటికొద్దామని ఫైల్సు వేగిరం క్లోజ్‌చేశాను." చేతకాని గుమాస్తా సంజాయిషీ!

"అలా వచ్చేటప్పుడు నాకు పువ్వులు, పిల్లలకి స్వీట్స్ తేలేకపోయారా?"

తన చేతకానితనానికి ఎత్తిపొడుపు!

"మర్చిపోయాను." ముక్తసరిగా సుబ్బారావు జవాబు.




"డెబ్భైతొమ్మిది వచ్చింది. కనీసం ఈ సంవత్సరమైనా స్కూటర్ కొంటారా? ఇంకా ఆ డొక్కు సైకిలుమీదే తిరుగుతారా?"

సగటు యిల్లాలి అసహనం!

"కొనాలనే ఉంది. కాలమే కలిసి రావడం లేదు." భర్త అసహాయత!

మరి కమల ఏమీ మాట్లాడలేదు. మౌనంగా అతనికి వడ్డించడం ప్రారంభించింది.

* * *

సుధాకరంగారు 'స్పీడ్'గా కారు 'డ్రైవ్' చేస్తున్నారు. అతని 'ఫియట్' కారు చక్రాలతో పోటీగా అతని 'మస్తిష్కం' లోని ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి!

'కాంట్రాక్టు' మీద ఎంత డబ్బు వచ్చినా తనకి సరిపోవడంలేదు. గత రెండేళ్లుగా తనని అడుగుతున్నా, భార్యకి మరో కారు కొనలేకపోతున్నాడు. ఆమె 'మహిళామండలి ప్రెసిడెంటు' అయిన తరువాత ఆమెకో కారు తప్పనిసరి అయింది. ఏమిటో తనకి వచ్చిన 'బిల్స్' లో ఆ అఫీసువాళ్లకి 'పర్సెంటేజ్' పంచడంతోనే సగం అయిపోతుంది. ఇహ ఆ సిమ్మెంటు రేటు సరే సరి!

కనీసం యీ సారైనా ఆమెకో కారు కొనాలి! తన మీటింగ్స్‌కి వెళ్లడానికి సరైన కారులేక నానా యిబ్బందీ పడ్తోందామె. తను యింటికి వెళ్లేవరకూ ఆమె 'వెయిట్' చేయడం- సరిగ్గా తనకి అదే సమయంలో ఏదో అర్జంటుపని తగలడం! ఇలా గడిచాయి ఎన్నో రోజులు!

ఇవ్వాళ కూడా ఆమె ఆఫీసుకి ఫోన్ చేసింది తొందరగా రమ్మని। అయినా 'టెండర్ ఓపెనింగ్'కి తను వెళ్లక తప్పిందికాదు.

అదృష్టవశాత్తూ ఆ అయిదు లక్షల కాంట్రాక్టూ తనకే రావడం కొంత ఆనందంగానే ఉంది।

ఇంతలో తన బంగళా వచ్చేసింది।

గేట్ ముందాపి హారన్ నొక్కారు సుధాకరంగారు।

గూర్ఖా వచ్చి గేట్ తీసి సలాం చేశాడు. కారు లోపలికి పోనిచ్చి, పోర్టికోలో ఆపారు. అక్కడే 'మిసెస్ సుధాకరం' నిలబడి ఉంది. స్లీవ్‌లెస్ బ్లౌజ్, కాశ్మీర్ సిల్కు సారీ, హైహీల్స్, కుడిచేతికి ఎలక్ట్రానిక్ వాచీ, చేతిలో హేండ్‌బ్యాగ్। కాని ఆమె కళ్లల్లో మాత్రం నిప్పులు।

"ఈ రోజు జనవరి ఫస్టు కదా। మా మహిళామండలిలో భారీఎత్తున మీటింగుందని మీకు సాయంత్రమనగా ఫోన్ చేస్తే ఇప్పుడా రావడం? స్వంత కారు వుంచుకుని టాక్సీలో వెళ్తే 'స్టేటస్' ఏం ఉంటుంది? అందుకే నాకో కారుండాలని రెండేళ్లుగా మొత్తుకోవడం- అయినా నా విషయం మీకు గుర్తుంటేగా?" ఆమెలోని దర్పం పలుకుతున్న మాటలవి।

"నీకూ తెలుసు కదా, మనకున్న ఖర్చులు. అయినా మంచి టెండర్ మనకి తగిలిందిలే। ఇందులో నీకో కారు కొనడం ఖాయం. ఇదిగో కారు తాళాలు. వెంటనే వెళ్లు." అని లోనికి నడిచారు. కాంట్రాక్టర్ సుధాకరంగారు మిసెస్ సుధాకరం యింకా ఏదో గొణుక్కుంటూ, కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోయింది।

సుధాకరంగారు మొహం కడుక్కొని తనకోసం టేబిల్ మీద 'ఒంటరిగా' ఎదురుచూస్తున్న భోజనంముందు కూర్చున్నారు యాంత్రికంగా।

* * *

జనవరి 1, 1980

కాలచక్రంలో ఓ సంవత్సరం గిర్రున తిరిగిపోయింది-

సూరిగాడి 'రిక్షాచక్రం'లాగ,

సుబ్బారావు 'సైకిల్ చక్రం'లాగ,

సుధాకరం 'కారు చక్రం'లాగ।

మళ్లీ సూరిగాడు కొత్త సంవత్సరం నాడు 'అద్దె రిక్షా తొక్కుతూనే' యింటికి పోతున్నాడు- కలలు కంటూ।

మళ్లీ సుబ్బారావు సైకిల్ తొక్కుతూనే యింటికి పోతున్నాడు- స్కూటర్ కొనాలని ఆలోచిస్తూ।

మళ్లీ సుధాకరంగారు కారులోనే యింటికి పోతున్నారు- కాని, అతని 'మస్తిష్కం'లో ఆలోచనలేవీ లేవు। ఎందుకంటే-

అతని భార్యకు అప్పటికే ఓ కొత్త 'అంబాసిడర్ కారు' కొనేశారు గనుక!!!

---